



# దూరదృష్టి

నెమలూరి భాస్కరరావు

ఆయన పేరు నారపరాజుగారు. వరుసగా ఆరు సంవత్సరాల నుంచి ఆయన సెంట్రల్ మినిష్టరు పదవిని నిర్వహించారు. ఆరు లకారాల పైనే సంపాదించారని ప్రతీతి. ఆయన ఇద్దరు కుమారులూ ఫారిన్‌లో చదువుకుంటున్నారు.

ఒక్కగా నొక్క కుమార్తెకు మొన్నీ మధ్యనే రెండు లకారాల కట్నం ఇచ్చి వైభవంగా వివాహం జరిపించారు.

ఆయనకో అందమైన భార్య. ఆవిడ పేరు మీనాక్షి. నాలుగైదు మహిళా సంస్థలకు ఆవిడ ప్రెసిడెంటుగానూ, సెక్రటరీగానూ వ్యవహరిస్తూన్నారు. ఆవిడ కో అందమైన బ్యూక్ కారు, మరో అందమైన చిన్న బొచ్చుకుక్కపిల్ల టామీ వున్నాయి.

ఆ ఇంటినిండా బోలెడంతమంది నౌకర్లు చాకర్లు వున్నారు. అందమైన వాళ్ళ డాబాముందు ఓ చిన్న పూలతోట. దానికో తోటమాలి వున్నారు.

అమ్మగారూ, అయ్యగారూ, రోజులో చాలాభాగం వుపన్యాసాలకు, సభలకు వెళ్ళిపోతూంటారు. బొచ్చుకుక్క పిల్ల మాత్రం చక్రవర్తిలాగా, ఆ డాబాలోనూ, తోటలోనూ, వీధిలోనూ, షికార్లు చేస్తూంటుంది. ఆ కుక్కపిల్ల అంటే అమ్మగారికి పంచప్రాణాలు. అది ఓపూట అన్నం తినకపోతే, ఆవిడకు నిద్రపట్టదు.

అంతదాకా ఎందుకు? ఓసారి ఎవరో ఓ దౌర్భాగ్యుడు, వుద్యోగంకోసం, రెకమండేషన్ లెటరుకోసం, అయ్యగార్ని యాచించటాన్కి, పొట్టకు బదులు, గొడుగు చేతబట్టుకుని వచ్చాడు. దరిద్రానికి ప్రతినిధిలా వున్నవాడిని చూచి, టామీ బొయ్యమంటూ వాడిమీద పడింది. ప్రాణ రక్షణార్థం ఆ దౌర్భాగ్యుడు చేతిలోవున్న గొడుగుతో దాన్ని ఓ దెబ్బ వేశాడు. టామీ కుయ్యోమంటూ ఇంట్లోకి పరుగెత్తింది. ఆ సమయాన్కి అమ్మగారు ఇంటిలోనే వున్నారు. జరిగింది తెలుసుకుని ఆవిడ మూడోనేత్రం తెరిచి, భర్తకు ఫిర్యాదు చేశారు. ఆ దెబ్బతో ఆ నిర్భాగ్యుడికి ఉద్యోగం రాకపోగా, వాడి అన్నగారు చేస్తున్న ఉద్యోగంకూడా వూడిపోయింది. అంత ఇన్ఫ్లూయెన్సు సంపాదించుకుంది టామీ ఆ ఇంట్లో.

శ్రీవారి ఇంటి కెదురుగా ఓ చిన్న పెంకుటిల్లు. ముప్ఫయి సంవత్సరాలు ఎన్. జి. వో. గా చేసినవాడి నెత్తిన, వూడిపోయిన వెంట్రుకల్లా, ఆ ఇంటి కప్పుమీద పెంకులు లేచిపోయి, చిందరవందరగా వున్నాయి. ఆ ఇంట్లో ఓ రిటైరయిన బడిపంతులు, వడిలిపోయిన వంకాయలాంటి ఆయన భార్య, ఆయన సంతానం ఏడుగురు మొగపిల్లలు, ఏడుగురూ ఎన్. జీ. వో. లుగా ఆ వూరిలోనే బ్రతుకుతున్నారు. ఆ ఏడుగురి భార్యలూ, వాళ్ళ పిల్లలూ, వెరసి ఆ కొంపలో ఓ పాతికమందిదాకా జనాభా బ్రతుకుతున్నారు.

పంతులుగారి భార్య ఈరోజు ఒక ఘోరమైన అపరాధం చేశారు. ఆవిడ మడికట్టుకుని వంట చేసుకుంటూంటే, నారపరాజుగారి బొచ్చు కుక్కపిల్ల, షికారుగా సరాసరి పంతులుగారి వంటింట్లోకి వచ్చేసింది.

కార్డియోగ్రాఫ్ చూశాను - మీ గుండె చాలా బలహీనంగా వుంది - నా బిల్లు మూడు వాయిదాల్లో పంపుతాను!!




"అయ్యో! అయ్యో! పాడుకుక్క!" అంటూ బుగ్గలు నొక్కుకుని, చేతిలో వున్న గరిటె దానిమీదకు విసురుతూ "ఛీ....ఛీ ..." అన్నారు. ఆ గరిట సరాసరి వెళ్ళి టామీ కుడికాలుకు తగిలింది. అది కుయ్యోమంటూ, కుంటుకుంటూ వెళ్ళిపోయింది.

పంతులుగారింట్లోంచి, టామీ కుంటుకుంటూ రావటం తోటమాలి చూశాడు. క్షణాలమీద వెళ్ళి, A. C. రూమ్‌లో వున్న అమ్మగార్కి ఆ విషయం మనవి చేశాడు ఆవిడ తల్లడిల్లిపోయింది.

కుంటుకుంటూ వచ్చిన కుక్కపిల్లను ఎత్తుకుని, కళ్ళనీళ్ళ పర్యంతం అయి, కాసేపటికి రౌద్రాకారం దాల్చి, శ్రీవారి సమాలోచనామందిరానికి నడిచారు.

ఆ సమయంలో శ్రీవారు వందరూపాయల కట్టలు ఓ పది టేబులుమీద పడేసి, "చూడు, నాగరాజూ! ఈ లక్ష రూపాయలూ ఓటర్లందరికీ పంచిపెట్టు. పబ్లిసిటీ గ్రాండుగా చేయించు. మన ప్రత్యర్థిగాడు చిత్తయిపోవాలి. ఆడి వోట్లుకూడా మనకే పడాలి," అంటూ విలాసంగా మీసం దువ్వుకున్నారు.

నాగరాజు, అతని అనుచరులు డబ్బు మూటకట్టుకుని, "మీరేం కంగారు పడమాకండి. విజయం మీదే! ఆ రెడ్డిగాడిని చిత్తుచిత్తుగా ఓడించే పూచీ మాది," అంటూ వెళ్ళిపోయారు.

ఈలోగా అమ్మగారు వచ్చి, జరిగిన కథంతా వినిపించి, ఆ పంతుల్ని పిలిచి గట్టిగా చీవాట్లు వెయ్యమని చెప్పి కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు,

నారపరాజుగారు తాపీగా చుట్ట వెలి

గించి, పంతులుగారి కోసం కబురు పంపారు. ఓ పదినిమిషాల తర్వాత పంతులుగారు చేతులుకట్టుకుని శ్రీవారి ముందు నిలబడ్డారు. శ్రీవారు సతీమణితో కొలువు తీర్చియుండగా, పంతులుకి ఏం మూడిందో చూద్దామని, నౌకర్లు గది వెలుపల ఆతృతగా చూస్తూ నిలబడ్డారు.

పంతులుగారి గుండెలు గుబగుబ లాడుతున్నాయి.

నారపరాజుగారు పంతుల్ని చూసి చిరునవ్వు నవ్వి. "రండి పంతులుగారూ! రండి. కూర్చోండి. అన్నట్లు మీకు పిల్ల లెంతమందన్నారు? ఏడుగురు కదూ? నా మతి మండిపోనూ, ఏ విషయమూ సరిగ్గా గుర్తుండి చావదు. అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయిగా? ఏమిటోనండీ, మీరు ఇన్ని సంవత్సరాలనుండి మా యింటి ముందే వున్నారా, మీ గురించే నాకు సరిగా తెలియదు. ఏవేవో బాధ్యతలు! తీరిక వుండదు. గాంధీగారు పొరుగు వాడిని ప్రేమించు అన్నారు. నాకేమో దేశ సేవకే టైము చాలటంలేదు. పొరుగున వున్న మీబోటివారి క్షేమసమాచారాలు తెలుసుకునేందుకు నిమిషంకూడా వీలుపడి చావటంలేదు. అన్నట్లు మీకు పెళ్ళీడు కెదిగిన ఓ అమ్మాయి వుండాలను కుంటాను?'' అన్నారు.

"అవును, బాబుగారూ. రేపు వైశాఖంలో దానికి పెళ్ళి.'' అన్నారు పంతులు గారు.

"ఎంతమాట! చెప్పారు కాదేం మరి? పాపం! ఈ రోజుల్లో ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యటం అంటే మాటలా? మాబోటి వాళ్ళకే కష్టంగా వుంది. ఇదిగో ఈ వంద రూపాయలూ నా కానుకగా మీ అమ్మాయి వివాహానికి వుపయోగించండి. మొహమాట పడకండి, మాష్టారూ! పొరుగు వాళ్ళం! ఆ మాత్రం ఆదుకోకపోతే ఎలా? పెద్దవయసు! కూర్చోమంటే కూర్చోరాయిరి! నిలబడి ఎంతసే పుంటారు? అసలే చలికాలం. వెళ్ళి విశ్రాంతి తీసుకోండి. అప్పుడప్పుడు కన పడతారుగా?'' అంటూ చుట్ట నోటిలో పెట్టుకున్నారు శ్రీవారు.

పంతులు నమస్కరించటంకూడా మరిచిపోయి, అయోమయావస్థలో ఇంటి వైపు నడిచాడు.

"ఏమిటండీ మీరు చేసిన పని? కుక్క పిల్ల కాలు విరగ్గొట్టారు, పిలిచి చీవాట్లు వేయండి అంటే, వందరూపాయలతో సత్కరించి పంపుతారా? మీకు మతుందా, పోయిందా?'' అంటూ నిప్పులు క్రక్కారు అమ్మగారు.

"పిచ్చిదానా ... ఏడుగురు కోడళ్ళు.... పంతులుగారు....కొడుకులు...ఎలక్షన్లు... ఇరవై రోజుల్లోకి వచ్చేశాయి అప్పుడే!'' ఫిలప్ ది బ్లాంక్స్ అంటూ హడావిడిగా వెళ్ళిపోయారు రాచకార్యాలమీద శ్రీవారు.

అమ్మగార్కి ఆయనమాటలు అర్థం కాక అయోమయంగా చూస్తూ నిలబడ్డారు శ్రీవారు వెళ్ళినవైపు. చేతుల్లో వున్న బొచ్చుకుక్కపిల్ల జాలిగా నాకుతూ, అమ్మ గారికేసి చూడసాగింది.